# వంకర

ఐదు గంటలుదాటి ఆఫీసునుంచి అతడు వచ్చే టైము క్షణక్షణాలకీ దగ్గరవుతూ వుండడంతో ఆమెకు ఎందుకో ఎప్పుడూలేని చీదర పుట్టుకొస్తున్నది. మనస్సు ఏమాత్రం ప్రసన్నంగా లేదు. తలనొప్పి పుడుతున్నది. కళ్ళు మంటలు పుడుతున్నాయి. ఏదో అసహనమూ, వెక్కసమైన ఉద్వేగమూ, అశాంతి ఆమెను బాధ పెడుతున్నాయి. తాను పెద్ద పొరపాటు చేశాననీ, ఈ పొరపాటును సరిదిద్దుకొనటానికి వీలులేదనీ, ఎందుకో విచారం కలిగి చిక్కబడి పోతూన్నది.

ఇక ఆయనగారు, తన వాలకం చూసి, పోనీ కొంతసేపైనా తనను మాట్లాడించకుండా ఉండరు. లక్ష ప్రశ్నలు, వెయ్యి వేధింపులు. తలనొప్పి అని పొరపాటున అంటే, చేతులకు పెయిన్‌బామ్ రాసుకుని తయారు. "వద్దండీ ఇప్పుడు నన్ను కాసేపు మాట్లాడించవద్దు. అదే నాకు పదివేలు" అంటే ముఖమంతా చిన్నబుచ్చుకొని బ్రతిమాలటం

చేస్తారు. దాంతో ఎక్కడలేని చీదరా వస్తుంది. "కాఫీ పెడతాను, కాస్త తాగు అదే తగ్గిపోతుంది. మనలో మనకు అరమరికలెందుకు. నీకు ఒంట్లో బాగాలేనప్పుడు ఇలాంటి ఇంటిపనులు చక్కబెట్టడంలో తప్పు లేదు. పోనీ నువ్వు పడుకో, నేను విసురుతాను" ఇదీ వరస. "మీరు నా దగ్గర వద్దు. మీపని మీరు చూసుకోండి. అదే తగ్గిపోతుంది" అంటే వినరు. తన పక్క దులిపివేయటం, ఏదో కొంప మునిగిపోయినట్లు. చిన్నపిల్లవాడిలా తొందరా, ఆయనా! బహుచిరాకు పుట్టుకొస్తుంది.

మనిషిగా తనకుతాను ఏమాత్రం విలువ యిచ్చుకోలేని మనిషి ఆయన. అదుగో అయిదుంబావైంది. వీధిమలుపు తిరిగి ఉంటారు. నెమ్మదిగా నడవ్వలసి రావటం వలన ఇంకా పావుగంట పడుతుంది. కొద్ది రోజులక్రితం ఐదుంబావు కాగానే వీధి వాకిట్లోకి వచ్చి నిలుచుని ఆయనగారికోసం ఎదురుచూసేది. వీధిలోపోయే వాళ్ళందరు ఆయనవేపే చూస్తోంటే ప్రాణం చివుక్కుమనిపించేది. కాలు ఈడ్చుకుంటూ వచ్చేవారు. తాను అలా వీధిలో నిలబడి తనకొరకు ఎదురుచూడటం ఆయనగారి కెంత సంతోషాన్ని కలుగజేసేదో. లోకంలో అన్ని తత్వాలకు విరుద్ధమైన తత్వం ఆయనది. కొందరైతే ఆడవాళ్లు వీధిలో నిలబడితే కోపగించుకుంటారు. తమ రాకకోసమే నిరీక్షిస్తున్నా సరే ఈయనగారు మాత్రం ఎంతో సంతోషపడేవారు. వారానికి రెండుమారులైనా సినిమాకు రమ్మని బ్రతిమాలేవారు. తాను వెళ్ళదలచుకున్న రోజున తానే చెపుతాననీ, తన నలా బ్రతిమాలవలసిన పనిలేదనీ ఖండితంగా చెప్పిన తరవాత మానుకున్నారు. బొటాబొటిగా సరిపోయే జీతంలోనే, తను కాపరానికి వచ్చిన మొదటిరోజుల్లో ప్రతినెలా చీర తీసుకొచ్చేవారు. తరువాత అలా చేయకండి అని ఆంక్షపెట్టిన తరువాత మానుకున్నారు.

తన నీడలా చుట్టూ చుట్టూ తిరుగుతున్నందువల్లనో ఏమో రాను రాను ఒక రకమైన అసంతృప్తికూడా కలిగిందేమో తనకు.

అదుగో ఆయనగారు రానేవచ్చారు. వస్తూనే కంగారుగా
"ఏమలా ఉన్నావు ?". పేరుపెట్టి పిలవమని ఎన్నోమార్లు చెప్పింది. ముచ్చటగా ఈ రోజుల్లో అందరూ అలానే పిలుచుకుంటున్నారు. ఈనగారు అలా పిలవమని చెప్పినప్పుడల్లా ఎంతసిగ్గుపడేవారో. నసుగుడూ, తనకు చికాకు. పోనీ అలానే సావిత్రీ నిన్ను సావిత్రీ అనో సావీ అనో పిలుస్తాను-అనరు. చాలా రోజులు ఆయనగారి మనస్సులోని పరమ రహస్యం తెలుసుకోలేదు. ఒకరోజు బుజ్జగించి అడగ్గా చెప్పారు. ఎవరో ఎక్కడో ఎప్పుడో ఎందుకో అంటే వినటమో లేక, ఏ పుస్తకంలోనో చదవటమో జరిగిందట! భార్యను పేరెట్టి పిలవకూడదట. అలా పిలుస్తే ఆయుక్షీణమని చెంపలు చేతులతో రాస్తూ "నేనలా బ్రతుకగలనా బంగారుకొండా". తనకు నవ్వాలో ఏడవాలో తెలీకపోయింది. అలా బొట్టు పెట్టుకొని ఆఫీసుకు వెళ్ళొద్దండీ అని చెప్పింది చాలాసార్లు. "మా ఆఫీసరుకూడా ఎప్పుడూ అనలేదు ఇట్లా. చిన్నతనాన నేను స్కూలుఫైనలు ప్యాసయ్యేదాకా, రోజూ స్కూలుకు వెళ్ళేప్పుడు మా అమ్మ నాకు బొట్టు పెట్టి పంపించేది. నీకు బాగులేకపోతే క్రమంగా మానేస్తాను, ఒక్క రోజులో మానుకోలేను, ఏమంటావు" అని ప్రాధేయపడేవారు.

"ఎందుకట్లా వున్నావు? ఒంట్లో బావులేదా. మధ్యాహ్నం భోజనం చేశావా! ముఖమంతా అలా వాడిపోయి ఉంది ఎందుకు? డాక్టరుగారి దగ్గరికి వెళ్దాం, రిక్షా పిలవనా?" ఆయనగారు ఒకటే సొదగా మాట్లాడుతూ ఉంటే తనకు విసుగు. ఏమీవద్దు అన్నది సావిత్రి.

ఆమె అలా అంటే తనను కోపగించుకుంటున్నట్లు, చిన్నబుచ్చుతున్నట్లూ ముఖం పెట్టాడు సుందర్రావు. ఆ ముఖం చూస్తే చాలా కోపం వస్తుంది సావిత్రికి. తానేమన్నానని ఆయన అంతలా బాధపడిపోవాలి. చూసి చూసి విసుగెత్తిపోయింది.

సుందర్రావు కాసేపు ఆమెను బ్రతిమాలుకున్నాడు. సావిత్రి చాలా చీదరంగా చెప్పింది. "ఎందుకో రెండుమూడు రోజులనుంచీ నా మనస్సు ప్రశాంతంగాలేదు. నన్నిబ్బంది పెట్టకండి, నన్ను మాట్లాడించకండి" అని చెప్పింది. సుందర్రావుకు మనసు విరిగిపోయినట్లనిపించింది. తను ఆమెపట్ల ఎంతో ఆపేక్షగా, ఎంతో ప్రేమగా నడచుకుంటున్నప్పుడు, ఆమెకు తనపట్ల ఈ నిర్లక్ష్యమూ, ఈ నిరసన భావమూ ఎందుకో అర్థం కావడంలేదు. ఏ స్త్రీ అయినా భర్త తనను అత్యధికంగా మన్నించాలనీ, ప్రేమించాలనీ కోరుకుంటుందంటారు. తాను ఆ విధంగా నాలుగు వేపులనుంచి ఆమె మనసు కనిపెట్టి నడుచుకుంటున్నాడు. కాని తన కాకృతజ్ఞతన్నాలేదు. సుందర్రావు ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయేటప్పుడు మామూలుగా తాను ఎక్కడకు వెడుతున్నదీ, మళ్ళీ ఎన్నిగంటలకల్లా ఇంటికి వచ్చేదీ చెప్పి వెళ్ళేవాడు. సరిగ్గా ఆ సమయానికే ఇంటికి వచ్చేవాడు. ఒకసారి ఏ స్నేహితుడితోనో సుందర్రావు చెప్పటం సావిత్రి కూడా వింది "నాకు ఆఫీసు విడిచిన తరువాత ఒక్క క్షణంకూడా వీధిలో ఉండబుద్ధికాదు. సెలవు రోజునకూడా నేను ఎక్కడకూ వెళ్ళలేను. మా ఆవిడ ఎదురుగా ఉండటమే నా కన్నిటికన్నా సంతోషమైన విషయం." ఆ మాటలు విన్నప్పుడు తానూ సంతోషించకపోలేదు. కాని ఇప్పుడా మాటలు తలచుకుంటే సంతోషంగా లేదు సావిత్రికి.

సుందర్రావు ఈ విధంగా వీధి వాకిట్లోనుండి వెళ్ళిపోవటం సావిత్రికి కొంత ఆశ్చర్యాన్నే కలిగించినా, బరువు తీరిపోయినట్లు తృప్తిగా నిట్టూర్చింది. మళ్ళీ ఇంతలో అంత త్వరగానే అతడు వచ్చేస్తాడేమో నన్న భీతి కూడా కలిగింది. పోయి వీధివాకిలి గడియపెట్టి వచ్చి మంచం మీద పడుకుంది. భర్తముఖం కళ్ళముందు మెదులుతూ, ఆమె హృదయంలో అసంతృప్తి విస్తరిస్తున్నది. ప్రక్కకు తిరిగి పడుకుంటున్నప్పుడు, ఎత్తుగా గోడమీద తగిలించబడిన పెద్ద అద్దంలో తన ముఖం కనపడింది. ఆమె జాలిగా, సానుభూతిగా, తనను చూసుకుంది. ఇవాళ శుక్రవారం కావటంవలన ప్రొద్దున తలంటుకున్నదేమో వొదులొదులుగా ఉన్న కురులు ముఖంమీదికి తోసుకుని వస్తున్నాయి. చుట్టపక్కాలందరూ తన కళ్ళ అందాన్ని మెచ్చుకునేవారు. ప్రొద్దున కాటుక పెట్టుకోవటం వలన అవి మరింత కాంతిగా సోగగా కనిపిస్తున్నాయి. అర్ధ నిమీలితంగా చేసి చూసుకున్నది తన కళ్ళను. ఎంతో బావున్నాయి. కొవల విల్లు వంగినట్లుగా ఉంటాయి నీ కళ్ళు అని సుందర్రావన్నప్పుడు తానెంతో పొంగిపోయింది ఇదివరలో. ప్రక్కకు తిరిగి పడుకోవటంలో పొడుగాటి జడ వీపుమీదనుండి జారి ప్రక్కమీద పొడుగ్గా అందంగా కనిపించింది. ఈ వీధిలో లేదు ఇంత పొడుగాటి అందమైన జడ అని తనకు గర్వమే. అందులో తప్పుకూడా తనకేమీ కనపడదు. ఆ గర్వపడటంలో నన్న మాట. సావిత్రి పక్కకుతిరిగి కళ్ళు మూసుకుని పడుకున్నది.

వీధిలో సోడాబండివాడూ, చామంతిపూలు అమ్ముకునేవాడూ కేకలువేస్తూ పోతున్నారు. అంతకన్నా మరేమీ సందడిలేదు, క్షణ క్షణానికీ ఆయనవచ్చి వీధితలుపు కొడతారేమోనని ఉలికిపాటుగానూ ఉన్నది. సాయంసంధ్యవేళ వీధి తలుపుమూసి ఇలా ఒంటరిగా తనలో తాను మాట్లాడుకోవటం ఏమీ బాగాలేదు సావిత్రికి. తమ ప్రక్కఇంట్లో

ఇవాళ క్రొత్తగా వచ్చారు ఎవరో. ఇదివరలో ఆ ఇంట్లో అసవాళ్ళు పొలకువ కనిపించేదికాదు. నెః రోజులక్రితం ఎప్పుడో ఆయనే ఆ ఇంట్లో ఎవరో వచ్చి చేరారని చెప్పారు. ఆ విషయమై తానేమీ ఆసక్తి చూపలేదు. ఇవాళ ప్రొద్దున వాళ్ళు బండిదిగుతూ ఉంటే తాను చూసింది. వాళ్ళిద్దరినీ అలా చూసినప్పుడు ముందు సంతోషమూ, తరువాత దిగులూ కూడా కలిగాయి తనకు. ఒకరికొకరు తగిఉన్నారా భార్యభర్తలు. ఆమె మధ్యాహ్నం మూడు గంటలవేళ వచ్చి వొక ఐదు నిమిషాలు కూచుని పోయింది తమ ఇంట్లోకి.

ఆ ఇల్లంతా వాళ్ళే తీసుకున్నారుట. ఆయనకు చాలా పెద్దఉద్యోగమే. ఆ అమ్మాయి తనకన్నా ఒకటి రెండేళ్ళు చిన్నదయి ఉండవచ్చును. మళ్ళీ తరువాత కలుస్తానని త్వరత్వరగా వెళ్ళిపోయింది. ఆయనగారి రాక కోసమేనేమో ఈ ఆత్రుతఅంతా అనిపించినప్పుడు సావిత్రికి చాలా ఈర్ష్యకూడా కలిగింది. తన మొండితనం వల్లనేనేమో తన కింత అసంతృప్తి అని సావిత్రికి అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది. చిన్నప్పటినుంచీ అదేమిటో కాని, తన మాటే తనదికాని, ఇతరులమాట వినేది కాదు. తనకు తన శక్తియుక్తులపైన అమితమైన ఆత్మవిశ్వాస మన్నమాట. తనలో ఏదో ప్రత్యేకత ఉందనీ, తాను అందరికన్నా తెలివిగల దాన్నీ, అందమైనదాన్నీ అని సావిత్రి అనుకునేదీ, సామాన్యంగా తన ఈడు పిల్లలు నగలగురించీ, చీరలగురించీ, ప్రేమలుగురించీ, మాట్లాడుకుంటూ వుంటే వాళ్ళకన్న తానెంత పై స్థాయిలో ఉన్నదో ఆలోచించి సంతోషపడేది.

ఎలా ఈ జీవితాన్ని ఆనందమయం చేసుకోవచ్చునో తనకు తెలుసనుకునేది సావిత్రి. అందుకే పెళ్ళి విషయంలో తాను స్వంతగా నిర్ణ

యించుకుంది కాని ఇతరుల మాటలను పాటుగా పట్టలేదు. ఐదారు సంబంధాలు వాళ్ళు చేసుకుంటామన్నా, తన కిష్టంలేక తాను త్రిప్పి కొట్టింది. ఐదారు సందర్భాలలో కట్నందగ్గరో, కానుకదగ్గరో వాళ్ళే పేచీలుపడి తప్పుకున్నారు. అప్పుడు తాను తటస్థంగానే ఉండిపోయింది. నాయనమ్మ ఏదైనా సంబంధం వాళ్ళు చూడటానికి వస్తున్నారు అనగానే పెద్ద కోలాహలం చేసేది. ఆ పిల్లకు పెళ్ళి చేయకుండా ఇన్నాళ్ళు ఎదగనివ్వటమే తప్పనేది. ఈ సంబంధమైనా కుదురుతుందా అనేది. తల్లీతండ్రీ పెద్దవాళ్ళు కలిసి మంచీ చెడ్డా విచారించి చేసిన సంబంధాలు సలక్షణంగా ఉండటంలేదా? వీళ్ళ మొహం కాకపోతే చూడగానే మగవాడి అనుపానులన్నీ వీళ్ళకు తెలిసిపోతాయా! పూజకొద్దీ పురుషుడు. దానంకొద్దీ బిడ్డలూ, కాని, ఒకరాలి ఒకరర్ధమౌతుందా ఏమిటి? అని ఆసంబంధంవారు వచ్చి చూసి పోతామన్నరోజు ఉదయంనుంచి వాళ్ళు వచ్చి చూసిపోయినరోజు సాయంకాలందాకా వొకటే సాధిస్తూ ఉండేది.

ఏ సంబంధమైనా సరే కలిసి రాకపోవటానికి సావిత్రే కారణమని ఆవిడ దృఢమైన విశ్వాసంగా కనిపిస్తుండేది. దాన్ని అడిగేదేమిటి? దానికేం తెలుసు. ఒకవేళ అది చేసుకుంటానంటే అంతేచాలునని అనువుగాని సంబంధం చేస్తారా ఏమిటి? మంచీ చెడ్డలు మీరు చూడరా ఏమిటి? అని ఆమె తన తల్లిదండ్రులను కూడా దోషులనుగానే ఎంచి సంజాయిషీ అడుగుతుండేది. ఆమె పోరు మాటలూ, సాధింపులూ చూస్తే తనకు ఒళ్ళు మండుకపోయేది. పట్టుదలకొద్దీ ఆమె మాటలను పెడచెవిన పెట్టాలనీ, అపార్థాలు కల్పించాలనీ ఆమె మాటలు వినకూడదనీ అనిపించేది. ఆమె అనేది ఏ సంబంధం వాళ్ళయినా వచ్చి చూసి పోగానే ఏం? ఆ పెళ్ళికొడుక్కు ఏంతక్కువని? "ఎంతో బాగున్నాడు. వాళ్ళ కుటుంబంకూడా మంచి సంప్రదాయంగల కుటుంబం. కన్ను వంకరా?

కాళ్ళు వంకరా ? ఏం లోపం చూశావే నీవు ? నీకేం కనపడిందట, నీకేం తెలుసునట అని గయ్యిమని పోట్లాట పెట్టుకునేది. ఆమె దృష్టిలో వచ్చిన ఒక్క సంబంధానికి కూడా ఏలోపమూ ఉండేదికాదు. కన్ను వంకరా కాలువంకరా ? అన్నది ఆమె ఊతపదం.

ఒకసారి చాలా కోపం వచ్చి సావిత్రి ఖండితంగా తెగేసిచెప్పింది నాయనమ్మకు. నా ఇష్టమైతే కన్నువంకరైనా చేసుకుంటాను. కాలువంకరైనా చేసుకుంటాను నీ కెందుకు మధ్య ఈ కంఠశోష, నేనుగదా పెళ్ళి చేసుకోవలసినదాన్ని. ఇందులో నీ సలహా నాకేం అవసరంలేదు. నాయనమ్మ బుగ్గలు నొక్కుకుని, కళ్ళనీరు పెట్టుకుని, నేను బ్రతికుండగా నీకు పెళ్ళయ్యే రాతలేదు అని శపిస్తున్నాననుకుంటూ విదిలించివేసింది నేనూ అదే కోరుకుంటున్నానంది సావిత్రి. పెద్దవాళ్ళ మూర్ఖపు పట్టుదలలకు చిన్నవాళ్ళు బలికాకూడదన్న పట్టుదలతో. ఆమె పంతానికన్నట్లుగా అన్నంతపనీ చేసింది, సావిత్రికూడా పంతానికే అన్నట్లుగా, ఆ పెళ్ళికొడుక్కు కాస్త కాలువంకరే అయినా, తల్లిదండ్రుల నిస్పృహను పోగొడదామనో, ఇదివరలో తనకు సమ్మతమైనా, చాలా పొడుగనో, నలుపనో, వయసెక్కువనో, ఇంకా చదువు కావాలనో, ఉద్యోగం చేస్తూ ఉండాలనో, కట్నం ఇంకా కావాలనో, ఏదో ఒక కుంటిసాకుచెప్పి, తనను చేసుకోటానికి ఇష్టపడనివాళ్ళమీద కోపంకొద్దీ, వాళ్ళందరినీ సాధిస్తున్నట్టుగా, సుందర్రావు ఎర్రగా ఉంటాడనీ, ఆస్థి ఉన్నదనీ, బుద్ధిమంతుడనీ (నిజమేగా !!) ఉద్యోగంకూడా మంచిఉద్యోగమేననీ, చేసుకుంటాననీ అన్నది.

అమ్మా నాన్నవాళ్ళు కాలువొంకర – అని ముందూ వెనకా చూడక పోలేదు. చేసేదేంలేక, చివరకు నీ ఇష్టం అన్నారు. నా ఇష్టమేనంటినిగా–

అన్నది సావిత్రి ఉడుకుమోత్తనంగా. పెళ్ళి జరిగిపోయింది. సుంద రావు కాలువంకర అసలు సమస్యే కాదన్నట్లుగా తాను ఎంతో సంతో షాన్ని ప్రదర్శించింది పెండ్లిలో. అసలు ఆ విషయమే తనకు పట్టనట్లు చాలా జాగ్రత్తపడ్డది. ఎవరో ఏమూలో రహస్యంగా సుందరావు వంక రను గురించి చెవులు కొరుక్కోవటం తనకు వినపడకపోలేదు. సుంద రావుమాత్రం కొన్ని కొన్ని సందర్భాలలో బిడియపడ్డాడు. అలా బిడియ పడవద్దనే తాను చెప్పనుకూడా చెప్పింది. సుందరావు విషయంగా తన కేమీ అసంతృప్తి లేదని ఎన్నోమార్లు తనకుతానే చెప్పుకుంది. తనను మేనత్త మేనమామ పిల్లలూ, ఇంకా దగ్గరవాళ్ళు, సానుభూతితో, జాలితో చూశటం, ఒళ్ళు మండుకపోయింది. తన ఇష్టంతనది, వీళ్ళందరికెందుకూ? ఈ సానుభూతి, ఈ బాధ అందుకని తాను సుందరావును అతుక్కొని పోతున్నట్లుగానూ, అతనంటే తనకు ఎంతో ఆరాధనాభావం ఉన్నట్లూ, ఆ పెళ్ళిరోజున తననుచూసి జాలిపడిన వాళ్ళపైన కసి తీర్చుకుంది సావిత్రి.

కాని రాను రాను తనమీద తనకు జాలీ, సానుభూతీ, కలగవలసి రావటంతో తన ఊహలు పరస్పరం సంఘర్షించుకునేవి. మొదలు మొదలు అతడిలోవున్న వెలితినిగూర్చి తాను బాధపడకూడదని ప్రయత్నిం చేది. కానీ అతడే ఆ విషయాన్ని అడుగడుగునా తనకు గుర్తుచేసే వాడు. ఎక్కడికైనా తాము కలిసిపోతున్నప్పుడు బలవంతాన ఆ భావాన్ని తొలగదోసుకుందామని అనుకున్నా, అతడు చూపే బిడియం వలన, సంకోచం వలన, క్షణక్షణానికీ ఆ విషయమే గుర్తువచ్చేది.

ఏ బస్సు ప్రయాణంలోనో, రైలు ప్రయాణంలోనో, నలుగురూ తమవేపు చూడటం తమకు బాధాకరంగానే ఉండేది. కాని ఒక రకంగా ఈ అసంతృప్తిఅంతా అతడు తనపై చూపే అగ్గలమైన ప్రేమాభిమానా

లలో మరిచిపోయేది. అతడు తన యెడల ఏ లోపమూచేసి ఎరుగడు. పువ్వుచుట్టూ తిరిగే తుమ్మెదలాగా, తననే అంటిపెట్టుకుని ఉంటూ ఉండే వాడు. ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా తనను ఏమాత్రమూ చీదరించుకునేవాడు కాదు. ఆ ఆరాధనా, ఆస్వాత్మార్పణ చూస్తూవుంటే, క్రమంగా మనసులో ఏదో వెలితి ప్రవేశిస్తూ వచ్చింది. నిత్యజీవితం చప్పిడిగా, ఏ చవీసారమూ లేకుండా, క్రమబద్ధంగా గడిచిపోతూ ఉంటే అతడు చూపే ప్రేమాభిమానాలు, ఏ ఉద్రేకాలనూ, ఉత్తేజాలనూ ఇవ్వకుండా, పసిపిల్లల ఆటలాగా అనిపించేవి. పై పెచ్చు ఏ కారణమూ, అవసరమూ, సందర్భము లేకుండానే రోజూ సుందర్రావు సావిత్రిని కాసేపు బతిమాలుకునేవాడు. ఇలాంటి భార్య దొరకటం తన అదృష్టం అనేవాడు. తన పూర్వజన్మ పుణ్యం అనేవాడు. ఒకవేళ సావిత్రినే తను పెళ్ళి చేసికొనకపోయినట్లయితే తానేమైపోయి ఉండునో అనేవాడు. ఆమె సంతోషంగా తన మాటలన్నిటికీ ప్రతిస్పందించకపోయినా, ఇట్లానే ఏదో మాట్లాడుతూ ఉండేవాడు.

ఒకసారి దగ్గర బంధువుల ఇంట్లో పెళ్ళి జరిగినప్పుడు, తాను వెడతానన్నదీ. అతడు కూడా తనతో వస్తాననుకోలేదు. కాని వచ్చాడు. మళ్ళీ తానే అక్కడనుండి కదిలించవలసి వచ్చింది. ఏదో సందర్భంగా ఒక వారం రోజులు పుట్టింటికి పోయివుంటే, ఐదు ఉత్తరాలు వ్రాశాడు. సుందర్రావు ఇక అలానే రోజుకొక ఉత్తరం వ్రాస్తాడేమోనని ఇంకా ఐదారు రోజులుందామనుకొని కూడా, వెంటనే వచ్చేసింది సావిత్రి. అతడిలో దర్పమూ, హుందాతనమూ కన్పించేవి కావు. ఒక్కసారి కూడా కోపగించుకోలేదు. తాను నిర్లక్ష్యంగా ఉన్నా అతడు సంతోషించే విధంగా ప్రవర్తించలేకపోయినా, ఏమీ అనుకునేవాడు కాదు.

సావిత్రి లేచి లైటు వేసింది. చాలా ఆశ్చర్యపడింది. ఎనిమిది గంటలు కావస్తున్నా సుందర్రావు ఇంకా ఇంటికి రానందుకు. బహుశా తన అనుభవంలో సుందర్రావు ఎనిమిది గంటలదాకా ఇంటికి రాకుండా ఉండటం ఇదే మొదటిసారి. ప్రొద్దున్నే బండి దిగినవాళ్ళు ప్రక్కఇంట్లోంచి ఉన్నట్టుండి ఏడుపు వినబడటంతో సావిత్రి భయపడిపోయింది. ఏమిటోనని త్వరత్వరగా వరండాలోకి వచ్చి చూసింది. భర్త కోపంగా ఏమో ఆ అమ్మాయిని అరుస్తున్నాడు. ఆ అమ్మాయి ఒక మూల ఒదిగి ఏడుస్తున్నదిలాగుంది. సావిత్రి స్థాణువై పోయింది. సాయంకాలం ఆ అమ్మాయి తమ ఇంటికి వచ్చినప్పుడు వాళ్ళ దాంపత్యం గురించి ఎంతో ముచ్చటపడింది తాను ఒకరికొకరు ఎంతో సరిపోయారు అనుకుంది. మళ్ళీ ఇంతలోనే సుందర్రావు వీధి మలుపు తిరిగి ఉండవచ్చుననుకొని, తన మనస్సంతా నిరాదరణ భావంతో నింపుకొన్నది. బహుశా ఇవాళ తనను ఎలా బ్రతిమాలుకోవాలో ఏమని సంబోధించాలో, ఎంతగా తనను తాను అర్పించుకోవాలో, ఆలోచించుకుంటూ కాలీడ్చుకుంటూవస్తూ ఉండవచ్చును సుందర్రావు. నిజానికి, ఇప్పటికిప్పుడే అతడు త్వరగా ఇంటికి రావాలని అనిపించటంలేదు సావిత్రికి. పోనీ వచ్చేస్తే నాలుగు మెతుకులు తినో తినకనో, తలనొప్పిగా ఉందని పడుకుంటే సరిపోతుందని అనిపిస్తున్నది.

పక్కింట్లో ఆ అమ్మాయి ఏడుపు ఆగిపోయింది కాని, అతడి మాటలు కర్కశంగా ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి. వీధి వాకిట్లోకి వచ్చి చూసింది. వీధి దీపాల వెలుగులో ఎవరూ కాలీడ్చుకుంటూ రావటం లేదు. తాను తలుపు తెరవటమూ ఎవరో వీధిన నడుస్తున్న మనిషి తన వేపు గుచ్చి గుచ్చి చూస్తూ నడవటమూ, ఎంతైనా చికాకు కలుగజేశాయి సావిత్రికి. సుందర్రావు వెళుతూ ఎక్కడికీ వెళుతున్నదీ, ఎప్పుడు

వచ్చేదీ చెప్పకపోవటమే వింతగా ఉండగా, ఇప్పుడు ఎనిమిదిదాటుతున్నా ఇంటికి రాకపోవటం మరీ వింతగా ఉన్నది. మళ్ళీ గడియపెట్టి లోపలకు వెళ్లిపోయింది. తాను భోజనం చేసి పడుకుంటే అతడిమీద తనకుగల నిర్లక్ష్యం వెల్లడించుకున్నట్లవుతుంది అనిపించింది. మళ్ళీ ఇంతలోనే అతడిపట్ల తనకు కలుగుతున్న కోపానికీ, వైరస్యానికీ నొచ్చుకుంది. అతడిపైన తనకుగల అప్రియాన్ని, అతడు బాగా బాధపడి పోయేట్లుగా వెల్లడించాలని క్షణక్షణానికి కోరిక బలపడుతున్నది.

సావిత్రి నాలుగు మెతుకులు తినివచ్చి పక్కమీద వాలేసరికి తొమ్మిదికూడా దాటిపోయింది. భయపడటానికి ఇష్టపడక సుందర్రావు ఇంత ఆలస్యం చేస్తున్నాడేమని విసుక్కుంది. పది గంటలైనా అతడు రాలేదు. అప్పుడు నిజంగానే భయమూ, ఆ తరువాత సుందర్రావును గురించి జాలీ కలిగాయి. సావిత్రికి ఒంటరితనం దుస్సహంగానూ, భయంకరంగానూ ఉంటుందన్న విషయం తెలిసివచ్చింది. అన్నిటికన్నా ముఖ్యంగా, తానీ విధంగా ప్రవర్తించటం, భార్యకు కోపాన్నీ, అసహనాన్ని కలిగిస్తుందని బాగా తెలిసీ తెలిసీ, సుందర్రావు ఇంత ధైర్యంగా ఎలా ఉండగలిగాడన్న ఆశ్చర్యం కలిగింది. తనను తృణీకరించటమా? అన్న ఆలోచన వచ్చినప్పుడు, ఊపిరి ఆడనట్లుగా ఉక్కిరి బిక్కిరై పోతున్నది సావిత్రి. ఒకవేళ ఏ కారణమైనాసరే, అతడు రాకపోతే ప్రొద్దున్నే తాళంవేసి పుట్టింటికి వెళ్ళిపోదామనీ నిశ్చయించుకున్నది. కాని తెల్లవారిన తరువాత ఆ నిశ్చయాన్ని నిబ్బరంగా ఆచరణలో పెట్టలేక పోయింది.

తనకు పెళ్ళయిన తరువాత గడచిన నాలుగు సంవత్సరాలలోనూ, ఇటువంటి మానసిక స్థితిని ఆమె ఎప్పుడూ అనుభవించలేదు. ఇట్టి

ఉద్వేగాన్నీ, అసంతృప్తినీ కూడా ఎన్నడూ అనుభవించి ఎరుగదు. ఈ అసంతృప్తిలో ఎక్కడో కించిత్తు సుఖకరమైన ఉద్రేకం కూడా వున్న దనిపిస్తున్నది. ఇప్పుడు సుందర్రావు వస్తే తానేమీ అతన్ని విదిలించదు. వుదాసీనంగానే వుంటుంది. అతనియెడల తనకేమీ కోపంలేదు. బాగా ఆలస్యంగా కాఫీ త్రాగింది ఆమె. స్నానం చేసింది. ఇంకాకూడా సుందర్రావు రాకపోవటమనేదీ చాలా ఆశ్చర్యంగానే వుంది. ఏమైనా ప్రమాదంగాని జరగలేదుకదా అన్న భయం కలిగింది. వంట చేయాలన్న వుత్సాహం లేదు, ఏదో వుత్కంఠ. అందులోనూ నిరాశ, వుద్వేగమూ, క్షణక్షణానికీ సుందర్రావు వస్తే బావుండునన్న నిరీక్షణ ఆమెను కలచి వేస్తున్నాయి.

ఉదయం తొమ్మిది గంటలకు ఎవరో కుర్రవాడు వచ్చి సుందర్రావుగారు ఇచ్చిరమ్మన్నారని, మడిచిన వుత్తరాన్ని ఇచ్చినప్పుడు ఆమె గుండె ఝల్లుమన్నది. అంతవణుకు జీవితంలో ఎప్పుడూ రాలేదు తనకు. కళ్ళు గిర్రున తిరుగుతున్నట్లుగా అనిపించాయి. చేతులు వణుకుతూ వుండగా ఆ వుత్తరం విప్పి చదువుకుంది. సుందర్రావే వ్రాశాడు. గడిచిన రాత్రి తాను ఒక స్నేహితుడింట్లో గడిపినట్లున్నూ, ఇంకా ఐదారు రోజుల దాకా తాను ఇంటికి రావడం లేదనిన్నీ, ఈ ఐదారు రోజులు కావలిస్తే తాను పుట్టింటికి వెళ్ళవచ్చుననిన్నీ వ్రాశాడు ఆవిడకళ్ళు చెమర్చబోతుంటే బలవంతాన నిగ్రహించుకొని పెదవి కొరుక్కుంది. ఆమెకు ఎటు పాలు పోలేదు. ఆ కుర్రవాడేడీ అని చూస్తే తన వుద్వేగంలో గమనించలేదు, ఆ పిల్లవాడెప్పుడో వెళ్ళిపోయాడు. అప్పుడు తాను తాళంవేసి వెళ్ళిపోతే, ఆయన ఏం చేయగలడు. ఒకవేళ ఇంటికివస్తే తాళంచెవి ఎవరుయిస్తారు? ఆయనక్కూడా ఇంత ధైర్యమా? కాసేపు వెళ్ళిపోయి మళ్ళీ రెన్నాళ్లకు

గాని రాకూడదని ఆలోచించింది. కాని ఆ ఆలోచన బలంగా నిలవలేదు. సాయంకాలందాకా చూదామని పిచ్చిదానిలాగా కూచుండిపోయింది. మధ్యాహ్నం భోజనం చేయలేదు. నీరసంగా కళ్ళు మూసుకొని పడుకుంటే ఏవేవేవిటో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. నిజానికి సుందరరావు తనయెడ చేసిన అపచారం ఏమీలేదు. ఎప్పుడూ తన నతడు చిన్న బుచ్చలేదు. బహుశా అతడు తనపై చూపుతున్న ప్రేమాభిమానాలు ఎవరూ ఎవరిపైనా చూపరేమో. అతి తీపికూడా, మొహం మొత్తేట్టుగా సుందరరావు తనపట్లచూపుతున్న ప్రేమకూడా ఎక్కువైపోయిందేమో! ఎవరో తలుపు తడితే అంత నీరసంగా వున్నప్పటికి కూడా ఎంతో వుద్వేగంతోనూ, ఆశతోనూ పోయి తలుపు తెరిచింది. సుందరరావే ననుకున్నది. కాని ఆమె ఎంతో ఆశాభంగానికి గురికావలసి వచ్చింది. ఆ వచ్చింది సుందరరావు కాదు. నిన్న కొత్తగా పక్కింట్లోదిగిన అమ్మాయి. ఆ అమ్మాయి ముఖమంతా బాగా వాడిపోయి వున్నది. బాగా ఏడ్చినట్లు కళ్ళు వుబ్బిపోయి వున్నాయి. సావిత్రి ముఖంలోని నిరాశను, నిరుత్సాహాన్ని చూసి, ఆ అమ్మాయి చాలా ఆశ్చర్యపడింది, తలుపు తెరిచే ముందు సావిత్రి ముఖంలో వున్న కళ ఒక్కసారిగా ఆరిపోవటం, ఆ అమ్మాయికి బాధ అనిపించింది. మర్యాదకోసం సావిత్రి ఆ అమ్మాయిని ఆహ్వానించి ఇంట్లోకి తీసుకువెళ్ళింది. ఆ అమ్మాయి కూచుని మౌనంగా వుండిపోయింది. ఆ మౌనం చాలా బాధాకరంగానే వుంది. సావిత్రికి ఏం వుత్సాహంగా లేదు. పైన అప్పటిదాకా భోజనంకూడా చేయక పోవడంతో నీరసంగానూ వుంది.

సావిత్రే మౌనాన్ని భంగపుచ్చవలసివచ్చింది.

"ఏమండీ మీవారు ఏం వుద్యోగం చేస్తున్నారు?"

ఆ అమ్మాయి మామూలు ధోరణిలో కాసేపు మాట్లాడి వెళ్ళిపోతుం దనుకుంది. "ఏం వుద్యోగమైతే ఏమిటండీ, అదృష్టం లేకపోయిన తరువాత" ఆ అమ్మాయి ఇక తరువాత మాట్లాడలేక పోయింది. ఎంత నిగ్రహించుకుందామనుకున్నా నిగ్రహించుకోలేక బరువుగా ఏడ్చింది. సావిత్రికి గుండె పగిలినట్లనిపించింది ఆ అమ్మాయి చెప్పింది. "ఆయన గారిదంతా విపరీతమైన తత్వం. పెద్ద చదువు చదివారు. పెద్ద వుద్యోగమే చేస్తున్నారు. కాని మనిషికి విపరీతమైన అనుమానం, చెప్పలేని కోపం. క్రితం సంవత్సరం ఒక పిల్లవాడు పుట్టిపోయాడు. అప్పుడు కూడా నన్ను పుట్టింటికి పంపలేదు. మా వాళ్ళు ఎవరూ రాకూడదు. నేను పోకూడదు. ఆయనగారి మనసుకు ఇక ఏ ఇతర సంబంధమైన నొప్పికలిగినా, కోపం వచ్చినా, నన్ను కొడతారు. ఎవరూ నమ్మరు కూడా ఇట్లా జరుగుతుందంటే. చూడండి ముక్కూ మొహమూ కూడా ఎరుగని మీతో నా భర్తగారిని గురించి చెప్పుకోవాలంటే, నేనెంత బాధపడితే చెపుతానంటారు. ఎవరికైనా ఇష్టం వుంటుందా, తమ స్వంత విషయాలు చెప్పుకోవటం, అందులో ఇటువంటి విషయాలు. ఇటువంటి బ్రతుకు నేను బ్రతికి ఏం ప్రయోజనం చెప్పండి? ఈ ప్రపంచంలో నాకేం సుఖం వుంది. ఏం ఆశవుంది. ప్రపంచంలో ఇంత విచిత్రమైన మనుషులు ఎట్లా వుంటారో అనిపిస్తూ వుంటుంది. పెళ్ళి అయినదాకా నాకు ప్రపంచంలోవున్న వొక్క కష్టం తెలీదు, ఒక్క దుఃఖం తెలీదు"

సావిత్రికి ఆ అమ్మాయిని ఎలా ఓదార్చాలో తెలీలేదు. కాస్త కాఫీ పెట్టి అభిమానంగా స్నేహంగా మాట్లాడటానికి కూడా ఓపికలేక పోయింది. "నిన్నంతా నాకు జ్వరం వచ్చింది. అందుకే మంచం మీదనుండి లేవలేదు." అని ఆ అమ్మాయి నొచ్చుకుంటుందనే అబద్ధం చెప్పింది. "అయ్యో! నేనిప్పుడు వచ్చాను, మీ మనసుకు కష్టం కలి

"నిన్నటినుండి నేను భోజనం చేయలేదు తెలుసా ?"

సుందర్రావేమీ మాట్లాడలేదు. నిజానికైతే అతడు విద్యుద్వేగంతోవచ్చి తనచుట్టూ చేతులుచుట్టి అమితంగా బాధపడవలసినవాడు. అతడేమీ మాట్లాడకపోవటం ఆశ్చర్యమే. ఇందులో ఏదో తృప్తికూడా ఉన్నదనిపిస్తున్నది. అతణ్ణి తాను బ్రతిమాలుకోవాలేమో, ఉద్వేగపరచాలేమో, లేకపోతే అతడు కోపగించుకుంటాడేమో, తనతో మాట్లాడడేమో. ఈ ఆలోచనలే బద్ధకమంతా ఒళ్ళు విరుపుతో పోయినట్లూ చలికాలపు ఎండ శరీరానికి పులకలు కలుగజేసినట్టు ఏమిటో తృప్తినీ, ఉద్రేకాన్నీ శాంతినీ కలుగజేస్తున్నాయి సావిత్రికి. "నీవు నన్ను చేసుకోకుండా ఉండవలసింది సావిత్రీ !". సావిత్రి మెల్లిగా అతనిదగ్గరగా వచ్చింది. "అప్పుడు ఎక్కువ సుఖపడేదానివి". సావిత్రికి దుఃఖం వచ్చింది. అవును తన మనసు ఎంత వంకర !